ప్రజాశక్తి
ఆదివారం 16 జులై 2023 5 అనంతపురం



వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

సోషల్ వెల్ఫేర్ జెడిఎస్ మధుసూదన్‌రావు


మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జెడి ఎస్.మధుసూదన్‌రావు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతులు విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 52 వసతి గృహాలు ఉండగా 4500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారని వివరించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. త్వరలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి రాధిక, వార్డెన్ బాషా, సిబ్బంది రాధాకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర పెరిగింది ఒకటి.. పంపిణీ మరొకటి..!

◆ చుక్కల్లో టమోటా, మిర్చి ధరలు ◆ ప్రభుత్వమిస్తున్నది బియ్యం.. కంది బ్యాళ్లు..!

◆ అనంతలో స్టాల్స్ ప్రారంభం ◆ అది కూడా బయట మార్కెట్ ధరకే విక్రయాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కాయగూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పెరిగిన ధరలు భరించలేక ప్రజలందరూ గగ్గోలు పెడతున్నారు. టమోటా, మిర్చి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రెండూ కూడా కిలో వంద రూపాయలకుపైగా చేరాయి. దీని ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం సబ్సిడీతో వాటిని ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ధరలను తగ్గించే చర్యలు చేపడుతున్నామని ప్రకటించింది. ఇందుకు ప్రత్యేకమైన స్టాల్స్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పింది. కాని తీరా చూస్తే ఆ స్టాల్స్‌లో బియ్యం, కంది బ్యాళ్ల అమ్మకాలు ప్రారంభించారు. వీటిని కూడా మార్కెట్ ధర ప్రకారమే విక్రయాలు చేస్తుండడం గమనార్హం. బియ్యం ధర బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.48 ఉంది. కంది బ్యాళ్లు రూ.135 ఉన్నాయి. అదే ధరకు ప్రత్యేకమైన స్టాల్ పెట్టి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమ్ముతున్నట్టు ప్రచారం కల్పించడం పట్ల సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కాయగూరలన్నీ కిలో రూ.50 కంటే ఎక్కువ ఉన్నాయి. వాటిని తక్కువ ధరలో రైతు బజారుల్లో అమ్మాలని కోరుతున్నారు. కాని అవి కాకుండా బియ్యం, కందిబ్యాళ్ల పంపిణీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

బియ్యం, కందిబ్యాళ్ల స్టాల్ ప్రారంభించిన జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్

నిత్యావసర ధరలు పెరుగుతున్నందున బియ్యం ధరలను నియంత్రించడంలో భాగంగా బియ్యం పంపిణీకి ప్రత్యకమైన స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు అనంతపురం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ మేరకు శనివారం నాడు దీన్ని ఆయన ప్రారంభించారు. క్రమంగా అన్ని మున్సిపల్ ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. దీంతోపాటు కందిబ్యాళ్ల పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. మనిషికి పది కిలోల చొప్పున సోనామసూరి బియ్యం కిలో రూ.48కి పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

టమోటా, మిర్చి పంపిణీ చేయాలి

ప్రస్తుతం కాయగూరల ధరలు కొనలేనంతగా పెరిగాయి. అవి రైతు బజారుల్లో తక్కువ ధరకు పంపిణీ చేస్తే బాగుంటుంది. మిర్చి, టమోటా కిలో వంద రూపాయలకు దాటి ఉన్నాయి. ఏమి తినాలన్నా ప్రధానమైనవి ఈ రెండే. ఇప్పుడు రెండు కాయగూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏమి తినాలన్నా భయపడే పరిస్థితి ఉంది. కావున ప్రభుత్వం బియ్యం కంటే ముందు పై రెండు మిర్చి టమోటాను తక్కువ ధరకు సామాన్యులకు అందుబాటులో ఉంచితే బాగుంటుంది.

ఆరీఫా, గృహిణి, గృహిణి.

సమస్య ఒకటైతే... పరిష్కారం మరొకటి అన్నట్టుంది

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య టమోటా, మిర్చి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాని ప్రభుత్వం ప్రధానమైన సమస్యకు పరిష్కారం చూపకుండా బియ్యం పంపిణీ చేస్తామని స్టాల్స్ తెరిస్తే ప్రయోజనం ఏమిటి. ఆ బియ్యమైనా తక్కువ ధరఏమీ లేదు. ఇంచుమించు బహిరంగ మార్కెట్ ధరనే ఉంది. ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నది టమోటా, మిర్చి ధరలపైనే కావున వీటిని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి సబ్సిడీతో సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

వి.రామిరెడ్డి సిపిఎం నగర కార్యదర్శి.

17న ఎస్‌కెయు స్నాతకోత్సవం

◆ ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ రాక

◆ డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్

◆ 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

◆ 9150 పట్టాలు పంపిణీ

◆ ఎస్‌కెయు విసి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం ఈ నెల 17న ఉదయ 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఎస్‌కెయు ఉపకులపతి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరు అవుతార న్నారు. స్నాతకోత్స వానికి సంబం ధించిన ఏర్పాట్లపై శనివారం స్థానిక వర్సటీ పరిపాలన భవ నంలో విసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో ఎస్‌కెయులో జరిగిన స్నాతకోత్సవానికి అప్పటి గవర్నర్ సుర్జీత్‌సింగ్ బర్నాలా హాజరయ్యా రన్నారు. ఆ తర్వాత గవర్నర్లు స్నాతకోత్స వానికి హాజరు కాలేదన్నారు. రెండు దశాబ్దాల తరువాత ప్రస్తుతం గవర్నర్ స్నాతకోత్స వానికి విచ్చేస్తున్నారని చెప్పారు. గవర్నర్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, తదితరులు హాజరవుతా రన్నారు. 21 స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను బెంగళూరుకు చెందిన ప్రముఖ సమర్ధన దివ్యాంగుల సంస్థ వ్యవస్థాపక నిర్వహణ ధర్మకర్త డాక్టర్ జికె.మహంతేష్‌కు ఇస్తున్నట్లు చెప్పారు. 9150 మంది విద్యార్థులకు యూజీ, పీజీ డిగ్రీ పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 57 మంది ప్రతిభా విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పీజీ విద్యార్థులు 285 మందికి, ఎంఫిల్, పిహెచ్‌డి విద్యార్థులు 71 మందికి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

గవర్నర్ పర్యటన ఇలా..

గవర్నర్ 17న ఉదయం 9.30 గంటలకు వర్సిటీలోకి ప్రవేశిస్తారు. అక్కడ శ్రీకష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం రూ.3 కోట్లతో నిర్మించిన ఇంజినీరింగ్ కాలేజ్ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తారు. అక్కడే రూ.3.50 కోట్లతో నిర్మించిన మెన్ హాస్టల్, రూ.50 లక్షలతో నిర్మించిన మెస్‌హాల్, 60 అడుగులు రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం స్నాతకోత్సవం జరుగుతున్న భువన విజయం ఆడిటోరియంకు చేరుకుని ఆ కార్యక్రమంలో పాల్గొంటారు.

అధికారుల పరిశీలన

స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ వస్తున్న నేపథ్యంలో పలువురు అధికారులు ఎస్‌కెయులో పర్యటించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. డిఐజి అమ్మిరెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించి, విసితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పిఆర్ఓ రాంగోపాల్ పాల్గొన్నారు.


స్నాతకోత్సవం, గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై విసితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి


విలేకరులతో మాట్లాడుతున్న విసి రామకృష్ణారెడ్డి


కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి

కాలుష్య నియంత్రణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పట్టణ, నగరాల్లో గాలి నాణ్యతను పెంచి కాలుష్య నివారణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం. గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పర్యావరణ ప్రణాళిక అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని తగ్గించి, గాలి నాణ్యతను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. వాయు నాణ్యతను మెరుగుపరచడంలో భాగంగా నగరపాలక సంస్థలు, పోలీసు, కాలుష్య నియంత్రణ మండలి, వైద్యఆరోగ్య శాఖ, రవాణా ప్రత్యేక పర్యవేక్షణా చర్యలు చేపట్టాలన్నారు. కాలుష్య కారక వాహనాలను గుర్తించడంతో పాటు కాలుష్య నియంత్రణపై సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటిని నియంత్రించాలని డిటిసి వీర్రాజును ఆదేశించారు. తాను కూడా ఇకపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని రోడ్లపై చెత్తా చెదారం , అపరిశుభ్రత ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్లు రిటైల్ షాపులు హోటళ్లు, ఫంక్షన్ హాళు ,, ఇతర వాణిజ్య సంస్థల్లో క్రమం తప్పకుండా విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్తల నిర్వహణ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచుకోవాలన్నారు. అనంతరం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన శైలిలి ప్రచార గోడ పత్రికలను విడుడల చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా॥యుగంధర్, పశుసంవర్ధక శాఖ జెడి డా॥సుబ్రహ్మణ్యం, డిపిఒ ప్రభాకర్ రావు, అనంతపురం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టూ టౌన్ సిఐ శివ రాముడు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి, డిసిహెచ్ఓ డా॥వాణి, భూగర్భ జల శాఖ డిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వై.మోహన్

ప్రజాశక్తి-అనంతపురం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగ దారులసంఘాల సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. వినియోగదారుల సంఘాలను బలోపేతం చేయడం, ప్రజలకు అవగాహన కార్యక్రమములు నిర్వహించడం తదితర అంశాలపై ఇందులో చర్చించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికను నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా అనంతపురం జిల్లా నుంచి వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు వై.మోహన్‌ను ఎన్నుకున్నారు.

మెరుగైన చికిత్స, పౌష్టికాహారంతో టీబీ నయం

ప్రజాశక్తి-ఉరవకొండ

మెరుగైన చికిత్సతోపాటు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా టీబీని నయం చేసుకోవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంసి జయకృష్ణ, మెడికల్ ఆఫీసర్ సాహితి అన్నారు. శనివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచితంగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం కోసం సహాయ, సహకారాలు అందించేందుకుఉరవకొండ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున నిశ్చయమిత్రగా రిజిస్టర్ చేయించుకుని నిరుపేదలైన 40 మంది టిబి వ్యాధిగ్రస్తులకు వరసగా 6వసారి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ శ్రీరాములు, సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌నాయుడు, నాగేశ్వర్‌రావు, విశ్వనాథ్, మల్లికార్జున, టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ మాణిక్యాలరావు, ఎస్‌టిఎల్‌ఎస్ ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సారూ..న్యాయం చేయండి..

భూమిలోకి వెళ్లి దళిత కుటుంబం నిరసన

సొమ్మసిల్లి పడిపోయిన బాధితురాలు

ఆసుపత్రికి తరలింపు.. ఏళ్లుగా తెగని భూ సమస్య





పొలంలో నిరసన తెలుపుతున్న దళిత కుటుంబం (ఇన్‌సెట్‌లో) సొమ్మసిల్లి పడిపోయిన విజయమ్మ

ప్రజాశక్తి-శింగనమల

ఎన్నో ఏళ్లగా ఉన్న భూ సమస్యను పరిష్కరించాల్సిందేనని దళిత కుటుంబం ఐదురోజులుగా పొలంలోనే ఉంటూ నిరసన తెలుపుతోంది. ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకుంటూ పొలంలోనే జీవనం సాగిస్తున్నారు. అయితే శనివారం బాధిత కుటుంబానికి చెందిన విజయమ్మకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

వివరాల్లోకి వెళ్తే... నార్పల మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి, భర్త రమేష్, లక్ష్మీదేవి, భర్త వెంకటేష్, కదిరమ్మ, భర్త వీరన్నకు శింగనమల మండలం పెరవలి రెవెన్యూ పంచాయతీలోని సర్వే నెంబర్ 160లో 3.60 ఎకరాల పొలం ఉంది. ఈ భూమికి సంబంధించి 1975లో తమ పెద్దలు చేసుకున్న అగ్రిమెంట్ ఆధారంగా తమ భూమి తమకు ఇవ్వాలని దళిత కుటుంబం ఏళ్లగా పోరాడుతోంది. అయితే ఇదే భూమిని తమ పెద్దల భూమి అంటూ అదే గ్రామానికి చెందిన రామకృష్ణ 1.50 ఎకరాలు, వసంతమ్మ 1 ఎకరా, కె.రవి 1.10 ఎకరాలను 2010లో తమ పేర్లపైకి చేయించుకున్నారు. దీంతో అప్పటి నుంచి భూ వివాదం జరుగుతూనే ఉంది. ఈ విషయమై ఇరువురూ ఆర్డీవోలకు, కలెక్టర్లకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఆఖరికి కలెక్టర్ గంధం చంద్రుడు స్పందించి స్వయానా నాయనపల్లికి చేరుకుని వివాదంపై చర్చించారు. అప్పట్లో పూర్తిగా విచారించి దళితులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ముమ్మరంగానే స్పందించారు. అయితే కలెక్టర్ గంధం చంద్రుడు బదిలీ కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని బాధిత కుటుంబం వాపోతుంది. ఈనేపథ్యంలో గత సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినా స్పందించకపోవడంతో మంగళవారం నుంచి బాధిత కుటుంబం రోజూ పొలానికి చేరుకుని నిరసన వ్యక్తం చేస్తోంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు శనివారం ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురి బాధితుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నామని, ఎవరి వద్ద ఆధారాలు ఉంటే వారికి న్యాయం చేస్తామని చెప్పారు. దీంతో అధికారులతో మాట్లాడుతుండగా రమేష్ భార్య విజయలక్ష్మి ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే స్థానికులు, బంధువులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

కాగా ఐదు రోజుల నుంచి దళితులు పొలంలో నిరసన వ్యక్తం చేస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత కుటుంబ కోరుతోంది.

సమస్యల పరిష్కారానికి వినతి


ప్రజాశక్తి-గుత్తి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ శనివారం సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గుత్తి అధ్యక్ష కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిముట్లు పంపిణీ చేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ చనిపోయిన కార్మికులకు డెత్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. జనాభాకు సరిపడే కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20, 21వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గుత్తి ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, నాయకులు శేఖర్, శివ, ఎల్లప్ప,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : వైవిఆర్

ప్రజాశక్తి-గుత్తి


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని టి.కొత్తపల్లి, తొండపాడు గ్రామాల్లో సర్పంచులు నంద్యాల రాజేశ్వరి, ఎన్.రుక్మిణమ్మ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల పేదల అభివృద్ధి కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, జడ్పిటిసి రాధిక, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సునీలాయాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, నాయకులు బి.రాజకుమార్ రెడ్డి, బేడల వెంకటరాముడు, ఎన్ సి.రంగయ్య, డాక్టర్ వి.నాగేంద్ర, వై.సుభాష్‌రెడ్డి, బి.గురుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, వేల్పుల సోమశేఖర్‌యాదవ్, నంద్యాల చంద్ర, ఈశ్వర్, కౌన్సిలర్లు ఫారుక్, వాల్మీకి శివ, వరద, సర్పంచులు ఎ.వెంకటేష్, ఎం.గోపాల్, వాసుదేవరెడ్డి, చిదంబరి, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో బాల్య వివాహాల నిర్మూలన

ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మహిళా శిశుసంక్షేమ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలందరూ సమిష్టిగా పని చేసి బాల్య వివాహాలను నివారిద్దామని జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి సాధికారత అధికారిణి (ఐసిడిఎస్ పీడీ) బిఎన్.శ్రీదేవి అన్నారు. శనివారం కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశాల మేరకు ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు, విద్యా కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులు, నర్సులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు బాల్య వివాహాలను నిర్మూలించేందుకు సమిష్టిగా పని చేయాలని సూచించారు. జూన్ 14 2023న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసి 31 జిఓలోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సచివాలయాల్లోని మహిళా పోలీస్‌తో పాటు తప్పనిసరిగా ఎడ్యుకేషన్ సెక్రటరీ వెల్ఫేర్ సెక్రెటరీ, విఆర్ఓ, పంచాయతీ సెక్రటరీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, వాలంటీర్లు తప్పనిసరిగా బాల్య వివాహాలను నిర్మూలించడంలో కలిసికట్టుగా పని చేయాలని కోరారు. గ్రామంలోని కిశోర బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా చేసి ప్రతి శనివారం నాడు సచివాలయంలో మూడు నుంచి ఐదు గంటల వరకు వారికి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రుతుక్రమం వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, బాలలకు సంబంధించిన చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ అధికారి వనజాక్షి, సీడీపీఓలు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రమణ్యం, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, సచివాలయాల జిల్లా సమన్వయకర్త ధనుంజయ, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్ చంద్రకళ, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అభివృద్ధికి కృషి

జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ విభాగం అభివృద్ధికి నూతన విభాగ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రామశేఖర్‌రెడ్డి కృషి చేయాలని ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్ సూచించారు. ఈమేరకు ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ విభాగం విభాగాధిపతిగా భాధ్యతలు చేపట్టిన ఎం.రామశేఖరరెడ్డికి శనివారం పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సిబ్బందితో కలిసికట్టుగా పని చేసి ఇఇఇ విభాగం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇఇఇ విభాగ అధిపతి రామశేఖరరెడ్డి మాట్లాడుతూ విసి రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్య నారాయణ, ఎన్.విశాలి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టించకండి : డీఎస్పీ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

గ్రామాల్లో సమస్యల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఒకవేళ ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాకాకుండా మీ ప్రమేయం ఏమైనా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే తప్పులు మీ పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందన్నారు. అలాగే 60 సంవత్సరాలు దాటిన వారికి వచ్చే డిసెంబర్ నాటికల్లా ఏ కేసులూ లేవని పోలీస్‌స్టేషన్ తెలిపితే అలాంటి వారిపై రౌడీషీట్ తీసివేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఖాజాహుస్సేన్, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధిలో ఆర్డీటీ పాత్ర గొప్పది

ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌తో ఎఐబిఎస్ఎస్ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూఫెర్రర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బంజారాలు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని అభివృద్ధి చెందడంలో ఆర్డీటీ పాత్ర గొప్పదని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీనాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాబునాయక్ అన్నారు. శనివారం నగరంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూఫెర్రర్‌ను ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ నాయకులు కలిసి తండాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంజారా తండా ప్రజలు విద్యా, వైద్య సదుపాయాలు పొంది ఆరోగ్యాన్ని, చైతన్యాన్ని పొందారంటే ఆర్‌డిటి సంస్థ కృషి మరువలేనిదన్నారు. అంతేగాకుండా సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ఆర్డీటీకే తగ్గిందన్నారు. బంజారాల హృదయాల్లో ఫాదర్‌ఫెర్రర్ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్ నాయక్, ధరమ్‌సింగ్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు సుగుణాబాయి, ఈసీ సభ్యులు నరేష్‌నాయక్, గోవిందునాయక్, ఈశ్వరీబాయి, నగర నాయకులు గోవిందనాయక్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌పై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గుత్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా డిజిటల్ ఎడ్యుకేషన్‌పై స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. దాదాపు 12 రోజుల పాటు గుత్తి, గుంతకల్లు, పామిడి, వజ్రకరూరు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న దాదాపు 1400 మంది ఉపాధ్యాయలకు అధ్యాపకులు చంద్ర, రఘు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి మాట్లాడుతూ శిక్షణ ఇచ్చే బాధ్యతను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. మా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిజిటల్ బోర్డ్ లను సమర్ధవంతంగా ఉపయోగించే విధానం, విద్యార్థులకు సులువైన పద్ధతులలో ఎలా బోధించాలో అవగాహన కల్పించారన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్‌తో ఏపీ డిజిటల్ ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు దేశంలోనే అత్యుత్తమ విద్యను పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.రవి నాయక్, ఉపాధ్యాయలు శ్రీధర్ గౌడ్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల మందులు సీజ్

బుక్కరాయసముద్రం : అనుమతి లేని ఎరువుల మందులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మహలక్ష్మి ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సుమారు ఏడు కంపెనీలకు చెందిన పురుగు మందులను అనుమతి లేకుండా అమ్ముతుండటంతో రూ.2,59,115 విలువజేసే మందుల సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ సాయిప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ రవీంద్రబాబు, మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గార్లదిన్నె : ప్రభుత్వ నిబంధనల మేరకు పురుగు మందులు, రసాయనిక ఎరువులను విక్రయించాలని విజిలెన్స్ సిఐ రామారావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణాన్ని స్థానిక వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగ్గా లేని 29.5 లీటర్లు, 57840 విలువజేసే పురుగు మందులను సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి ఉన్న పురుగు మందులు, ఎరువులను మాత్రమే అమ్మాలన్నారు. లేనిపక్షంలో షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మణిపూర్ అల్లర్ల పాపం బీజేపీదే..

కళ్యాణదుర్గం : మణిపూర్ రాష్ట్రంలో జరిగిన హింసకు బిజెపినే కారణమని ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీ, పద్మావతి ఆరోపించారు. ఈమేరకు శనివారం స్థానిక టీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మైనార్టీ మహిళలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే జాతీయ మహిళా నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా మణిపూర్ సమస్యను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

బుక్కరాయసముద్రం : షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సిహెచ్ఒ మోహన్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శించి గర్భిణులతోపాటు 1 నుంచి ఐదేళ్లలోపు పిల్లల వివరాలను సేకరించాలన్నారు. అలాగే పిల్లలకే సకాలంలో టీకాలు వేస్తూ ఉండాలన్నారు. ఒకవేళ సకాలంలో టీకా తీసుకోని పక్షంలో వారికి సమీప ఆరోగ్య ఉప కేంద్రంలో వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎం చిన్నమ్మ, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లపై దూషణలు తగదు

ప్రజాశక్తి-ఉరవకొండ



కరపత్రం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేణు మాకులపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న ప్యాకేజ్ స్టార్ పవన్ కళ్యాణ్, నేడు చంద్రబాబు వలంటీర్లపై అనుచితంగా మాట్లాడడం దారుణమన్నారు. వలంటీర్లపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవడంతోపాటు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా దిగజారి మాట్లాడడమేనా 40 ఏళ్ల రాజకీయ అనుభవమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎగా, ప్రతిపక్ష నేతగా పని చేసిన నువ్వు ఇంత దిగజారి పోయావా.. అని నిలదీశారు. ఓట్ల కోసం సమాజం ఏమనుకుంటుందనే ధ్యాస లేకుండా మాట్లాడితే ఎలా అన్నారు. దీని కంటే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లను అడుక్కుతినడం మేలన్నారు. చంద్రబాబుకు వయసు పెరిగే కొద్దీ బుద్ధి మందగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, కురుబ కార్పొరేషన్ రాష్ట డైరెక్టర్ గోవిందు, పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఉరవకొండ పిఎసిఎస్ డైరెక్టర్ చిదంబరంనాయుడు, ఎంపిటిసి సోంపల్లి ఈశ్వర్, వైసిపి నాయకులు ఓబన్న, లింగన్న, కెపి.మల్లప్ప, జగదీష్, జెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పాల్తూరు ఎస్ఐగా కె.సురేష్‌బాబు



ఉరవకొండ : విడపనకల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కె.సురేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామచంద్రయ్య పుట్టపర్తి జిల్లాకు బదిలీ కావడంతో గుంతకల్ డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సురేష్ బాబు ఎక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సమన్వయంతో మెరుగైన సేవలందిస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, మహిళలు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకురాలు ఫర్వీన్ హెచ్చరించారు. శనివారం మండలంలోని కొర్రపాడు ఆరోగ్య కేంద్రం పరిధిలోని రోటరీపురం గ్రామంలో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్వాక్రా గ్రూపుల సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టబోయే శిశువు ఆడ.. మగనా.. అని గర్భస్త పిండ లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించవద్దన్నారు. ఆడపిల్లలని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నిషేధం అన్నారు. గర్భిణీని మానసిక, శారీరక ఒత్తిడికి గురికాకుండా కుటుంబ సభ్యులు, సన్నిహితులతో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్ వింధ్య, మహిళా పోలీస్ విజయ జ్యోతి, సంఘం లీడర్లు వెంకటలక్ష్మీ, శకుంతలమ్మ, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ రగడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అంతటితోనే కాకుండా తాడిపత్రి వంటి ప్రాంతాల్లో రగడలకు దారితీస్తున్నాయి. ఇంక సమయం దగ్గరపడే కొద్దీ ఇవి ఏ స్థాయికి చేరుతాయోనన్న ఆందోళన నెలకొంటోంది. ఈ వారంలో చూస్తే తాడిపత్రి నియోజకవర్గంలోని రాజకీయాలు వేడి పుట్టిస్తున్నాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ ఇరు కుటుంబాల మధ్య ముందు నుంచి ముఠా తగాదాలున్న విషయం తెలిసిందే. 1980 దశకం నాటి నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య ముఠా పోరు నడుస్తూవస్తోంది. ఇందులో అనేక మంది తగాదాల్లో బలైపోయిన వారూ ఉన్నారు. ఇటువంటి తగాదాల్లో 2004లో కేతిరెడ్డి పెద్దారెడ్డి సోదరుడు కేతిరెడ్డి సూర్య ప్రతాప్‌రెడ్డి హత్యకు గురయ్యారు. అప్పటి నుంచి ఆ కుటుంబం తాడిపత్రిలో కాకుండా ధర్మవరంలో ఉంటూ రాజకీయాలు చేస్తూ వచ్చింది. అయితే 2019లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి బరిలో దింపారు. అప్పటి వరకు అంటే 1985 నుంచి 2014 ఎన్నికల వరకు ఓటమన్నది ఎరుగకుండా జెసి కుటుంబం విజయం సాధిస్తూ వచ్చింది. తొలిసారిగా 2019లో ఆ కుటుంబం ఓటమిని చవిచూసింది. దీంతో మూడు దశబ్దాల తరువాత ఆ కుటుంబానికి స్థానికంగా అధికారం కోల్పోవలసి వచ్చింది. అయితే ఆ తరువాత మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది జెసి.ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ అయ్యారు. ఈ పదవి రావడంతో తాడిపత్రి పట్టణంలో ఇద్దరి మధ్య అధికారం చెలామణిలో తరచూ సమస్యలు రావడం మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంటూ వస్తోంది. ఈ నేపథ్యంలో పంటలబీమాలో అక్రమంగా పరిహారాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పొందారని జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ఆయన ప్రతిస్పందించడంతో తాడిపత్రి రాజకీయాలు మరోమారు వేడెక్కాయి. ఇదే సమయంలో నియోజకవర్గంలో వరుసగా రెండు రోజులు టిడిపి, వైసిపి నాయకులు దాడులు చేసుకోవడం గాయాలపాలై ఆసుపత్రుల్లో చేరారు. అధికారం అడ్డుపెట్టుకుని తమ వారిపై వైసిపి నాయకులు దాడులు చేస్తున్నారని టిడిపి ఆరోపిస్తోంది. ముందు నుంచి ఈ ప్రాంతం ఫ్యాక్షన్ ముద్రపడినది కావడంతోపాటు, మారుతున్న రాజకీయ పరిణామాలు తిరిగి పాత పద్ధతుల్లోకి తీసుకెళుతున్నా అన్న ఆందోళన స్థానిక ప్రజల్లో కనిపిస్తోంది. ఇతర ఫ్యాక్షన్ ప్రబావిత ప్రాంతాల్లో పరిస్థితులు నివురుగప్పిన నిప్పుల కనిపిస్తున్నాయి. ఫ్యాక్షన్ లేకుండా చేస్తామని, పోలీసులకు స్వేచ్ఛ నిస్తామని ప్రారంభంలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించియున్నారు. ఇప్పటి వరకు అటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాని వస్తున్న రాజకీయ పరిణామాలు, వాతావరణం చూస్తే అందరిలోనూ గుబులు నెలకొంటోంది. ముఠా కక్షలకు తావు లేకుండా పోలీసు శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా ఎన్నికల సమయం సమీస్తున్న కొద్దీ ఆధిపత్యపు పోరులు పురుడుపోసుకుంటున్నాయి. వీటిని నియంత్రించే చర్యలు చేపట్టపోతే పరిస్థితులు చేయి దాటిపోయే అవకాశాలూ లేకపోలేదన్న ఆందోళన ఉంది. ప్రజలు ఇప్పటికే అనేక రకాలైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమయంలో గ్రామాల్లో ఈ పోరులు మొదలవుతే ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారీపోతాయన్న ఆందోళన నెలకొంది.

అదనపు తరగతి గది ప్రారంభం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. విప్ కాపు దంపతులు సొంతంగా డబ్బు వెచ్చించడంతో కళాశాల అధ్యాపకులు అభినందించారు. అలాగే కళాశాలలో రూ.39 లక్షలతో అమ్మాయిలకి మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ కళాశాలకు ప్రహరీ లేదని దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం విప్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం : ప్రజలు సైబర్ నేరగాళ్లతో మోసపోవద్దని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గుజ్జల సరళాదేవి నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడుతోవ పట్టకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా జరిగితే వెంటనే 100కు డయల్ చేసి తెలియజేయాలన్నారు. అనంతరం దిశాయాప్, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, మహిళలపై నేరాలు, చైన్ స్నాచర్లు, చోరీలు, సైబర్ నేరాలు, 1930, ఆన్‌లైన్ లోన్‌లపై అవగాహన కల్పించారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వడ్డెర హక్కుల సాధనకు జిల్లా పర్యటన

అనంతపురం : వడ్డెర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ త్వరలో జిల్లా పర్యటన చేయనున్నట్లు వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల మురళి తెలిపారు. శనివారం నగరంలో నిర్వహించిన జిల్లా వడ్డెర సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపటి నుంచి వడ్డెర్ల హక్కుల సాధన కోసం జిల్లావ్యాప్తంగా పర్యటించి వడ్డెర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వైసిపికి చెందిన కొంతమంది నాయకులు వడ్డెర కులస్తులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే వడ్డెర కార్పొరేషన్‌కు కనీసం ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. వడ్డెర్లను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు కలిసికట్టుగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంప పెద్దన్న, కుంచప్ప ఆదెప్ప, పీట్ల రవీంద్ర, శ్రీనివాసులు, వడ్డే మురళి, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బోధనేతర సిబ్బందికి ఉద్యోగోన్నతులు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కలిస్తూ ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్య నారాయణ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతులు పొందిన సిబ్బందిని జెఎన్‌టియు విసి జి.రంగజనార్ధన, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నూర్ మహమ్మద్, శంకర్‌రెడ్డి, రమేష్, సునీల్, బోధనేతర సంఘం సభ్యులు ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ కె.సుదర్శన్ అభినందలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఇంజినీర్ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన కృష్ణమోహన్ (55) కుటుంబ సభ్యులకు తోటి ఒప్పంద కార్మికులు శనివారం ఆర్థికసాయం చేశారు. తోటి ఉద్యోగులు అందరూ కలిసి ఒక రోజు వేతనం ఇవ్వగా సుమారు రూ.1,15, 500 వసూలు కావడంతో కమిషనర్ భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను సద్వినియోగం చేసుకోండి

బొమ్మనహాల్ : గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిటీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు శ్రీలక్ష్మీ సూచించారు. శనివారం మండలంలోని ఉద్దేహాల్‌లో ఫ్యామిటీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బిపి, షుగర్, గర్భ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సూపర్ రుక్మిణీ, ఫార్మాసిస్టు ఓబుల్‌నాయుడు, నర్సు జైనాబీ, గోవర్ధన్, శ్రీహరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : ఛాయపురానికి చెందిన ఎన్ఆర్ఐ పత్తిపాటి వెంకటేశ్వరప్రసాద్ దంపతులు (యుఎస్ఎ) కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన పత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, అట్టలు అందజేశారు. శనివారం వజ్రకరూరు మండలం, ఛాయాపురము ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు నాయక్ అధ్యక్షతన వహించగా, రిటైర్డ్ ఏడిఏ పి.కోనయ్య, అగస్త్య లక్ష్మీనారాయణ, పత్తిపాటి పావని హాజరై పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పత్తిపాటి పావని మాట్లాడుతూ చదువుతోనే ఏదైనా సాధించవచ్చన్నారు. ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. బాగా చదివి తల్లి తండ్రుల ఆశలు నెరవేర్చాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నాగరాజు, చంద్రకళ, శకుంతల, శైలజ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గుత్తి : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల సంరక్షణ సమితి కో ఆర్డినేటర్ రమాదేవి కోరారు. శనివారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలల సంరక్షణ వ్యవస్థలు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. ఫోక్సో చట్టం, బాలల సంరక్షణ వ్యవస్థల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ రుద్రాక్షి, ఏఎస్ఐ ఆజాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని మహిళ మృతి

తాడిపత్రి రూరల్ : ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వరదా రంగమ్మ (77) తన బంధువు అయిన ఎర్రగుంట్లకు చెందిన లక్ష్మీదేవితో కలిసి హైదరాబాద్‌కు రైల్లో బయలుదేరారు. వారు రైల్లో డోర్ దగ్గర కూర్చొని ఉండగా తాడిపత్రి మండల పరిధిలోని చల్లవారిపల్లి వద్ద రంగమ్మకు చెందిన బ్యాగు పడిపోయింది. దీంతో తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో దిగిన రంగమ్మ, లక్ష్మీదేవి కలిసి రైల్వే ట్రాక్ వెంబడి బ్యాగులు వెతుక్కుంటూ వెళ్తుండగా అదే సమయంలో మరో రైలు వచ్చి ఢీకొంది. దీంతో రంగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. లక్ష్మీదేవికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య



మృతిచెందిన సుంకిరెడ్డి

పెద్దవడుగూరు : మండలంలోని కాసేపల్లికి చెందిన వై.చిన్న సుంకిరెడ్డి (90) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకిరెడ్డికి తరచూ ఆరోగ్య సమస్యలు వచ్చేవి. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమణించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడి కుమారుడు రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదరించండి.. అండగా ఉంటాం..

అనంతపురం : వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరిస్తే ప్రజలకు అండగా ఉంటామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విజ్ఞప్తి చేశారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను వివరిస్తూ చేపట్టిన జనసేన జయభేరి కార్యక్రమం శనివారం నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని కల్పనజోష్ కాలనీలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీని ఆదరించాలని కోరారు. అధికారంలోకి వస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, నగర కార్యదర్శులు విశ్వనాథ్, వడ్డే వెంకటేష్, సంయుక్త కార్యదర్శి ఆకుల అశోక్, మండల అధ్యక్షులు తోట ఓబులేసు, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్ నాయకులు రహీంబాషా, వీరమహిళలు పాల్గొన్నారు.

ఇనుప కమ్మీలు తొలగించాలని రాస్తారోకో

రాయదుర్గం : పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఎదుట రోడ్డుపై ఉన్న ఇనుప కమ్మీలను తొలగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాన్ని తొలగించినప్పటికీ అడుగుభాగాన ఉన్న రెండు స్తంభాలను రోడ్డుపై వదిలివేశారన్నారు. దీంతో ప్రజలు, వాహనచోదకులు గాయాలపాలవుతున్నారన్నారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎస్‌వి అంజనేయులు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజనేయులు, సిపిఐ నాయకులు గురుస్వామి నరసింహులు, నిరంజన్, దుర్గన్న, తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఉరవకొండ : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ధర్నాలో విద్యార్థులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాజేష్, చిరంజీవి, ప్రవీణ్, ప్రణయ్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయమే స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించారు. తర్వాత వెండి కవచం, సువర్ణ కిరీటాన్ని ధరించి తమలపాకుల పూజ చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం అందజేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు . ఈ కార్యక్రమంలో సర్పంచి పరమేశ్వర, ఆలయ అధికారి ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

బుక్కరాయసముద్రం : డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని స్టోర్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత డీలర్ల సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. వెంటనే డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని స్టోర్ డీలర్ల అధ్యక్షులు పుల రంగనాథ్, ఉపాధ్యక్షులు సాకే లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి పురుషోత్తం, డీలర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

'జగనన్న సురక్ష'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 9, 10, 23, 24, 25, 26, 39 డివిజన్లు, అనంతపురం రూరల్-1 పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ గురించి ఆలోచిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. నాలుగేళ్లలో ఏకంగా రూ.3లక్షల కోట్లను సంక్షేమం కోసం వెచ్చించామన్నారు. ప్రస్తుతం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ మేయర్ రాగే పరశురాం, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, చింతకుంట మధు, ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, సుమతి, బాబా ఫకృద్దీన్, లీలావతి, రామాంజనేయులు, మీనాక్షమ్మ, ఇషాక్, హరిత, సర్పంచి ఉదయ్, ఉప సర్పంచి సుమిత్రా, ఎంపిటిసి ఆశాజ్యోతి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్రంలో సిఎం జగన్ అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఉరవకొండ సచివాలయం-2 పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. గ్రామ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని వివరించారు. గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే ప్రజలకు సేవలు అందేవని కానీ జగనన్న పాలనలో ఇళ్లవద్దకే అన్ని రకాల సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. మండలంలో కొద్దిరోజుల్లోనే 5 వేల మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, సచివాలయ కన్వీనర్లు పద్మావతి, ఈడిగా ప్రసాద్, మద్దికెర అన్వర్, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెసిఎస్ కన్వీనర్ అసీఫ్, ఎంపిడిఒ చంద్రమౌళి, ఎంఎల్ఒ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


శెట్టూరు : మండలంలోని యాటకల్లు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ మైథిలి, సర్పంచి ఈరన్న కలిసి పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామ, భీమప్ప, తిమ్మరాజు పంచాయతీ కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 16, 17వ సచివాలయాల పరిధిలో ఉన్న చంద్రబాబు పార్కులో, 1, 18వ సచివాలయాలకు సంబంధించి పార్వతీనగర్ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సిఎం జగన్ చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాకు శిల్ప, డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు ఉషా, భాగ్యలక్ష్మి, గోవిందరాజులు, నాగవేణి, శారద, శ్రీలక్ష్మి, ఫక్రుద్దీన్, వన్నూరప్ప, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు శివ, శివప్ప, దివాకర్, గంగాధర్, సత్యనారాయణ, రిబ్కా, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచెర్ల, బుడేదు గ్రామాల్లో తహశీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు 1098 రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ప్రజల చెంతకే పాలన అనే కోణంలో సిఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారా యణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పి.నరసాపురం పంచాయతీలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు 2,250 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో వైసిపి 175 స్థానాలు గెలవడం ఖాయని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రతి పేదవాడి సమస్యను తెలుసుకుని తక్షణ పరిష్కారం చేయాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్.కొత్తపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడివో సరస్వతి, సర్పంచి సరస్వతి, వైసిపి నాయకులు ప్రభాకర్, అరుణ్‌రెడ్డి, రామచంద్ర, శివశంకర్, పలువురు పాల్గొన్నారు.

కొత్తచెరువు : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తలమర్ల గ్రామ సచివాలయం వద్ద 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై 1100 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్, ఎంపీడీవో సిద్ధారెడ్డి, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఏవో నటరాజు, ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, అగ్రి అడ్వైజర్ కమిటీ మండల ఛైర్మన్ ప్రమీల శ్యాంసుందర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సర్పంచి రత్నమ్మ, జడ్పిటిసి గంగాదేవి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి రూరల్ : 'జగనన్న సురక్ష' ద్వారా ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తహశీల్దార్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటగారిపల్లిలో సర్పంచి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో వైసిపి మండల మాజీ కన్వీనర్ గంగాధర్ 1000 మందికి పైగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి ఏవి రమణా రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శుభదాసు, సచివాలయాల కన్వీనర్ మల్లికార్జున, అగ్రి అడ్వైజరీ కమిటీ సభ్యుడు సూర్య నారాయణరెడ్డి, ఎంపీటీసీ, ప్రజలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : 'జగనన్న సురక్ష'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సర్పంచి నాగలక్ష్మీరాజు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, అగ్రి అడ్వైజర్ ఛైర్మన్ రమణారెడ్డి తెలిపారు. బుక్కపట్నంలో సర్పంచి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డి ఇందిరాబాల, వైస్ ఎంపీపీ పార్వతి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు పతాంజలి, నారాయణస్వామి, నాగభూషణ, మహేష్, మల్లికార్జున, ఈశ్వర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని బుడనాంపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, సర్పంచి వెంగల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సచివాలయం-2 పరిధిలోని మరువకొత్తపల్లిలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో లబ్ధిదారులకు 1230 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపిపి పురుషోత్తమరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు రామక్రిష్టారెడ్డి, హరీష్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

అమరాపురం : మండల పరిధిలోని హాలుకూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కృష్ణమూర్తి(52) అనారోగ్యం తో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈయన కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న తెలిపారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, నాగమ్మ, ప్రకాష్‌గౌడ్, హనుమంతరావు, ప్రకాష్, గోవిందరాయ కంచప్ప ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

పెనుకొండ : పట్టణంలోని సమత ఎన్జీవో కార్యాలయంలో శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బిజెడ్‌సి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం సేంద్రియ పుట్టగొడుగుల పెంపకం ఉత్పత్తులు తయారీ మార్కెట్లపై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేశవయ్య, అశోక్, పుట్టగొడుగుల పెంపకం శిక్షణ నిపుణులు ఎం.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

18న 'ఆశా' కార్యకర్తల ధర్నా

హిందూపురం : ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప హెచ్చరించారు. ఈ నెల 18న జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఆశా కార్యకర్తలు పాల్గొనేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ శనివారం పట్టణంలోని బోయపేట, లక్ష్మీపురం పిహెచ్‌సి కేంద్ర వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మమతమ్మ, జానకి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై అర్చకుల హర్షం

ఉరవకొండ : అర్చకులకు మేలు జరిగే విధంగా సిఎం జగన్ క్యాబినెట్‌లో తీర్మానం చేయడం పట్ల పెన్నఅహోబిలం ఆలయ అర్చకులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎవన్ ద్వారకనాథాచార్యులు, అర్చక సమాఖ్య జిల్లా కోశాధికారి మయూరం బాలాజీ చార్యులు, సభ్యులు జి.గుండురావు, జె.సత్యనారాయణ, కె.రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం స్థానిక ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ అర్చక వృత్తికి బ్రాహ్మణులు దూరమవుతున్న సమయంలో సిఎం తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదన్నారు. ప్రధానంగా అర్చకులకు వంశపారంపర్య హక్కులు, జీతాల పెంపు, వయోపరిమితి పెంపునకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదన్నారు. అర్చకుల మదిలో ఆయన ఎప్పుడూ నిలిచి ఉంటారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అర్చకులు